సాక్షి
పెద్దపల్లి

గురువారం : 25 : జనవరి : 2024



సమ్మక్క గద్దెల వద్ద పూజలు

సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్లలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యార్థులకు ఆటల పోటీలు

కమాన్‌పూర్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు బహుమతులు అందిస్తారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/21.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

3డీ ఆర్టిస్ట్‌కు అమెరికా ఆహ్వానం


శివరామకృష్ణ వేసిన త్రీడీ పెయింటింగ్

రామగిరి(మంథని): అమెరికా ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే లేక్ వర్త్ బీచ్ స్ట్రీట్ పెయింటింగ్ ఫెస్టివల్‌కు మనదేశం నుంచి అంతర్జాతీయ త్రీడీ పెయింటర్, జేఎన్టీయూలో మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సింగారపు శివ రామకృష్ణకు ఆహ్వానం అందింది. డౌన్ టౌన్ మిన్నియా పోలీస్ స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్ ఆహ్వానం మేరకు శివరామకృష్ణ ఇప్పటికే అమెరికాలో త్రీడీ ఆర్ట్స్ వేశారు. శివరామకృష్ణ మాట్లాడుతూ భారతీయ కళకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభించాలన్నదే తన ఆశయమన్నారు. ఆసక్తి గల దేశ, విదేశీ కళకారులకు ఆన్‌లైన్ ద్వారా త్రీడీ కళ నేర్పిస్తున్నామని ఆయన తెలిపారు.

అది పులి కాదు.. హైనా


పాదముద్రలు పరిశీలిస్తున్న రేంజర్ నాగయ్య

ముత్తారం(మంథని): మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధి శుక్రవారంపేట శివారులోని రామగిరిఖిలా సరిహద్దు పంట పొలాల్లోని రైతులకు కనిపించిన పాదముద్రలు పులివి కాదని పెద్దపల్లి అటవీశాఖ రేంజర్ నాగయ్య స్పష్టం చేశారు. పంట పొలాల్లో పులి అడుగులు కనిపించాయని, జింకను చంపిందనే స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు బుధవారం సంఘటనా స్థలాలు పరిశీలించారు. పులి అడుగులు 6 ఇంచుల పొడవు వరకు ఉంటాయని, కానీ, ఇక్కడి పాదముద్రలు పరిశీలిస్తే 3 ఇంచులే ఉన్నాయన్నారు. అవి హైనావిగా నిర్ధారించామని తెలిపారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, నిర్భయంగా తమ పొలాల వద్దకు వెళ్లాలని సూచించారు. ఇంకా ఏమైనా అనుమనాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఆయన వెంట కూనారం సెక్షన్ అధికారి వాయు కుమార్, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ తీరుపై విచారణ


ఫిర్యాదు చేస్తున్న బాధితుడు సమ్మయ్య

మంథని: స్థానిక మాతా శిశు ఆస్పత్రిలోని అనెస్తీసియా డాక్టరు మోహన్‌రెడ్డి తీరుపై బుధవారం విచారణ జరిపారు. ప్రసవం కోసం తన భార్యను ఈనెల 12న ఆస్పత్రికి తీసుకొస్తే సర్జరీ కోసం డాక్టరు డబ్బులు డిమాండ్ చేశారని పట్టణానికి చెందిన బండారి సమ్మయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డీసీహెచ్‌వో ఆదేశాల మేరకు శౌర్య, రాంమూర్తి బుధవారం ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. తొలుత మత్తు డాక్టర్‌ను వారు విచారణ జరిపారు. అనంతరం బాధితుడి నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. డీసీహెచ్‌వో ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారులు తెలిపారు.

విద్యుత్ కేంద్రం స్థాపించాలి


జెన్‌కో సీఎండీకి వినతిపత్రం అందిస్తున్న ఠాకూర్

గోదావరిఖని/రామగుండం: పట్టణంలో కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలని, బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీకి విన్నవించారు. బీ–థర్మల్ కేంద్రాన్ని తుక్కు కింద పరిగణిస్తూ నిధులు కేటాయించడం లేదని, దీంతో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపనకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి లభ్యత, సమీపంలోనే బొగ్గు గనులు, రాజీవ్ హైవే, రైల్వే కనెక్టివిటీ అందుబాటులో ఉన్నాయని, భూసేకరణ చేయాల్సిన అవసరం లేదని రిజ్వీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అన్నివిధాలా సహకరించేందుకు తాను కృషి చేస్తానని సీఎండీకి విన్నవించారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

రాజ‘కీ’య మలుపులు!

- రామగుండం బల్దియాలో మళ్లీ అసంతృప్తి సెగలు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ఆదేశాలు బేఖాతరు
- మళ్లీ సమావేశమైన సొంత పార్టీ కార్పొరేటర్లు
- తాజా పరిణామాలతో ‘ప్రత్యేక పాలన’కు ఆస్కారం!


రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాలు కీలకమలుపు తిరుగుతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్, డిప్యూటీ మేయర్‌పై సొంత పార్టీ కార్పొరేటర్లే అవిశ్వాసానికి తెరతీయడం, కలెక్టర్‌కు నోటీసు అందజేస్తామంటూ రోజుల తరబడి సాగదీయడం, ఇందుకు ప్రతిగా మేయర్, డిప్యూటీ మేయర్ మిగిలిన కార్పొరేటర్ల మద్దతు కూడగడుతూ వ్యూహాత్మకంగా పావులు కదపడం రాజకీయాలను రసకందాయంలో పడేశాయి. ఈ పరిణామాలు బల్దియాలో ప్రత్యేక పాలనకు దారితీసే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. తాజా రాజకీయ పరిణామాలపై ఎస్‌బీ పోలీసులు కూడా ఓ కన్నేసి ఉంచడం చర్చనీయాంశంగా మారింది.

సొంత పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు..

- బీఆర్‌ఎస్ చెందిన మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు కొంతకాలంగా సొంతపార్టీ కార్పొరేటర్ల నుంచే వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు.
- మేయర్ ఎన్నిక సమయంలో మద్దతుగా నిలిచిన కార్పొరేటర్లకు ఒప్పందం మేరకు పూర్తిగా ‘చెల్లింపులు’ చేయకపోవడం అసంతృప్తికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.
- దీనికితోడు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకపోవడం, అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో డివిజన్లలో పర్యటించలేకపోతున్నామని కార్పొరేటర్లు అసంతృప్తికి గురవుతున్నారని తెలుస్తోంది.
- అయితే, అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడితే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని భావిస్తున్న అసంతృప్తులు.. గతనెలలోనే అవిశ్వాస తీర్మానం పత్రాలపై సంతకాలు చేశారు.
- ఈ విషయం తెలిసి అప్పట్లో రంగలోకి దిగిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్.. అసంతృప్తి కార్పొరేటర్లకు నచ్చజెప్పడంతో ఆ ప్రయత్నాలు విరమించుకున్నారు.
- జిల్లా అధ్యక్షుడి ఆదేశాలు ధిక్కరిస్తూ తాజాగా ఇటీవల అసంతృప్తి కార్పొరేటర్లు భేటీకావడం, అవిశ్వాస తీర్మానం కోసం సంతకాలు సేకరించడం చర్చనీయాంశంగా మారింది.

దాటవేత ధోరణిలో..

శిబిరాలకు తరలివెళ్తామని, కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తామని అసంతృప్తి కార్పొరేటర్లు చెబుతున్నారు. అయితే, సంతకాల సేకరణ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని వాయిదా వేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. మేయర్, డిప్యూటీ మేయర్లపై తమకు పూర్తివి శ్వాసం ఉందని, అవిశ్వాస తీర్మానం పత్రాలను పరిగణనలోకి తీసుకోరాదని మరికొందరు కార్పొరేటర్లతో సంతకాలు చేయించి కలెక్టర్‌కు సమర్పించేందుకు మేయర్, డిప్యూటీ మేయర్లు వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. అంతేకాదు.. తమకు మద్దతుగా నిలిచే కార్పొరేటర్లను మచ్చిక చేసుకునేందుకు మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

కొత్త నిబంధనలతో ఈసీ ఉత్తర్వులు..

రాబోయే మున్సిపల్ ఎన్నికలపై ఎన్నికల కమిషన్ కొత్త నిబంధనలు రూపొందించి ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. మేయర్ ఎన్నికకు క్యాంపులు నిర్వహిస్తే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసిన విప్‌ను ఉల్లంఘిస్తే సభ్యులపై వేటు తప్పదని హెచ్చరించింది. మరో 11 నెలల్లో మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో పాలకవర్గంలో ఏర్పడిన ఈ లుకలకలు అధికారులను గందరగోళానికి, ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఇదేసమయంలో ప్రజాసమస్యలను అటెక్కిస్తున్నాయి.

ప్రత్యేక పాలనకు ఆస్కారం ఉందా?

- ఐదేళ్లు కొనసాగాల్సిన బల్దియా పాలకవర్గం పదవీకాలం అర్ధంతరంగా ముగిసి ప్రత్యేకాధికారి పాలనకు దారితీస్తొందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- మరో నెలరోజుల్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే.. అవిశ్వాస ప్రక్రియ ముగిసినా, కొత్త మేయర్‌ను ఎన్నుకునేందుకు అడ్డంకులు ఏర్పడితే ప్రత్యేక పాలన తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.
- అంతేకాకుండా 23వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సావిత్రి మరణించడంతో ప్రస్తుతం ఆ స్థానం ఖాళీగా ఉంది.
- కార్పొరేటర్ల ఖాళీలు భర్తీ చేసిన తర్వాతనే కొత్త మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.
- మున్సిపల్ ఎన్నికలు ముగిసి ఈనెల 22వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తయ్యింది.
- పాలకవర్గం ఆఖరు సంవత్సరంలో అడుగుపెట్టిన నేపథ్యంలో 23వ డివిజన్‌కు ఎన్నికలు నిర్వహిస్తారనే ఆశ అడుగంటింది.
- ఈ కారణంతో కొత్త మేయర్ ఎన్నిక లేకుంటే స్పెలాఫీసర్ పాలన ప్రత్యామ్నాయమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రంగంలోకి మాజీమంత్రి..

అసంతృప్తి కార్పొరేటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ రంగంలోకి దిగారని తెలిసింది. గజ్వేల్‌లోని రిసార్ట్‌కు తరలివెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్న ఆ కార్పొరేటర్లతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ వరకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారని తెలిసింది. ఆలోగా నేరుగా మాట్లాడతానని సూచించారు. దీంతో అసంతృప్తులు తాత్కాలికంగా వెనుకడుకు వేసినట్లు సమాచారం.

హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకుంటూనే ఉన్నతంగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజీలో బుధవారం సీనియర్ సివిల్ జడ్జి అర్జున్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బాలికలు ఉన్నత చదువులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. అనేకమంది మహిళలు ఉన్నతస్థానాలను అధిష్టించారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని వివరించారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ సభ్యులు శ్రీనివాస్, శంకర్, సంకీర్తన, సుజాత, ప్రిన్సిపాల్ సుజాత, రజిత, ఉమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈమేరకు బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో కలుసుని వినతిపత్రం అందజేశారు. ఎల్కలపల్లి–కన్నాల, కుక్కలగుడూరు–తక్కళ్లపల్లి, రామగుండం–రైల్వేస్టేషన్, పొట్యాల– మర్రిపల్లి, కుక్కలగుడూరు–ఈసంపేట, ఎంపీడీవో కార్యాలయం–రామగుండం–పేద్దంపేట మధ్య సుమారు రూ.25 కోట్లతో రహదారులు నిర్మించాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. అదేవిధంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

చరిత్రపై విద్యార్థులకు అవగాహన అవసరం

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- మ్యూజియం గురించి వివరణ


విద్యార్థులకు వివరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ‘ఈ ప్రాంత చారిత్ర అంశాలపై అవగాహన ఉందా?’ అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యార్థులను ప్రశ్నించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు బుధవారం కలెక్టరేట్‌లోని మ్యూజియం గురించి వివరించారు. గతంలో ఘనమైన చరిత్ర కలిగిన జిల్లా సమాచారంపై అందరికీ అవగాహన కల్పించాలనే ఆలోచనతోనే కలెక్టరేట్‌లో మ్యూజియం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 20కోట్ల సంవత్సరాల నుంచి 6 కోట్ల సంవత్సరాల నాటి డైనోసార్ ఎముకల శిలాజాలు, వృక్షశిలాజాలు, చేపశిలాజాలను సేకరించామని తెలిపారు. గతంలో వస్తుమార్పిడి విధానం అమల్లో ఉండేదని, శాతవాహన, బ్రిటిష్‌కాలంలో నాణేలను క్రమంగా అందుబాటులోకి తెచ్చారని వివరించారు. ఇపుడు కరెన్సీ నోట్లే ప్రధానమయ్యాయన్నారు. జిల్లాలో చారిత్రకక రామగిరిఖిల్లా, కోటిలింగాల, ధూళికట్ట బౌద్ధస్తూపం తదితర ప్రాంతాల ఫొటోలను మ్యూజియంలో అందుబాటులో ఉంచామని వివరించారు.

బ్రిటిషు కాలం నుంచే కలెక్టర్ వ్యవస్థ..

బ్రిటిష్ కాలం నుంచే కలెక్టర్ వ్యవస్థ అమల్లో ఉందని, అప్పట్లో భూమి శిస్తు వసూలు చేసేందుకే వారికి అధికారమిచ్చేవారని ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత తొలిహోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సూచనతో ప్రజలకు అనుకూలమైన సేవలు అందించేలా కలెక్టర్ వ్యవస్థలో మార్పులు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, కేజీబీవీ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

బాలికలు తాము ఎంచుకునే రంగంలో రాణించేందుకు ప్రస్తుతం పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, లక్ష్యం ఎంచుకుని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన బాలికా దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

స్కూళ్లలో పెండింగ్ పనులు పూర్తిచేయండి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): మన ఊరు.. మనబడి ద్వారా తొలిదశలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాల ల్లో పెండింగ్ పనులను రెండువారాల్లో పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో రామగుండం, పాలకుర్తి, అంతర్గం మండలాల్లో మన ఊరు – మనబడి పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై బుధవారం ప్రధానోపాధ్యాయులు, వర్కింగ్ ఏజెన్సీలు, అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనులు చివరిదశకు చేరుకున్నాయని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని స్కూళ్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. అన్నింటా ఈఎల్‌సీ క్లబ్బులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈవో మాధవి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఎస్ఈ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ఉన్నతంగా చదవాలి

ఓదెల(పెద్దపల్లి): విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చదువులో బాలురతో పోటీపడి రాణించాలన్నారు. ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలంటే పట్టుదలతో చదవాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న, ఎంఈవో రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి

గోదావరిఖని: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి సింగరేణి కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. ఆర్జీ–1 పరిధిలోని జీడీకే –1, 3 బొగ్గు గనులను అధికారులతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. గనిలోకి దిగి 4 సీమ్ 4ఎస్26 ప్యానెల్ డీపిల్లరింగ్ డిస్ట్రిక్ట్‌ను తనిఖీ చేశారు. పనిస్థలాల్లో ఉన్న గని అధికారులకు పలు రక్షణ చర్యల గురించి వివరించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించాలని చెప్పారు. బొగ్గు గని భవిష్యత్, నిల్వలు, రక్షణ చర్యలపై అధికారులతో చర్చించారు. కచ్చితంగా రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి సారించాలని అన్నారు. ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ బి.సైదులు, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, పిట్ ఇంజినీర్ శివకుమార్, జూనియర్ సర్వేయర్ శ్రీనివాస్, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


జీడీకే 1, 3 గనిపై జీఎం శ్రీనివాస్, అధికారులు

అధ్యాపకుడికి డాక్టరేట్

రామగిరి(మంథని): స్థానిక జేఎన్టీయూ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పుప్పాల తిరుపతి వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ పోలాల నిరంజన్‌రెడ్డి పర్యవేక్షణలో ‘ఏ నావెల్ క్లౌడ్ సర్వీస్ మోడల్ ఫర్ ఐవోటీ సపోర్టెడ్ బిగ్ అగ్రికల్చర్ డేటా అనలిటిక్స్’ అంశంపై పరిశోధన చేసినందుకు తిరుపతికి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు బుధవారం అభినందించారు.


పుప్పాల తిరుపతి

రోడ్డెక్కిన బూడిద పంచాయితీ

- యాష్ లోడింగ్, రవాణాలో ముదిరిన స్థానిక, స్థానికేతర వివాదం
- టిప్పర్ యజమానులు, నిర్వాసితుల ప్రత్యక్ష ఆందోళనలు
- స్పందించని ఎన్టీపీసీ యాజమాన్యం


లోడింగ్ లేక నిలిచిపోయిన టిప్పర్లు


టిప్పర్లను అడ్డుకుంటున్న స్థానిక ప్రతినిధులు

రామగుండం: ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, పల్లెవాసుల సంక్షేమం, నిర్వాసిత యువతీయువకులకు ఉపాధి అకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చిన ఎన్టీపీసీ యాజమాన్యం.. తన మాట నిలబెట్టుకోలేకపోతోంది. ప్రధానంగా ఎన్టీపీసీ యాష్‌పాండ్ ద్వారా బూడిద లోడింగ్, రవాణాకు అనుమతి ఇవ్వడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. యాష్‌పాండ్ ద్వారా ఉపాధి అకాశాలు మెరుగుపడతాయని భావించిన యువత ఆశలను నీరుగార్చుతోందనే విమర్శలు మూటగట్టుకుంటోంది. బూడిద లోడింగ్ విషయంలో స్థానికేతరులను ప్రోత్సహిస్తున్న యాజమాన్యం.. నిర్వాసితులు, స్థానికులను విస్మరిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా వారం రోజులుగా స్థానిక టిప్పర్ అసోసియేషన్ యజమానులు బూడిద కట్ట వద్ద టిప్పర్లను నిలిపివేసి నిరసన, ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

టిప్పర్ల అడ్డగింత

ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద రవాణా చేస్తున్న స్థానికేతర టిప్పర్లను స్థానిక ఆపరేటర్లు బుధవారం అడ్డుకుని నిరసన తెలిపారు. పొరుగు జిల్లాల నుంచి వచ్చే టిప్పర్లతోపాటు ఎన్‌హెచ్(హైవే) రహదారుల అవసరాల కోసం బూడిద తరలించే లారీలను సైతం వారు అడ్డుకుని వెనక్కి పంపించి వేశారు. స్థానికులకే రవాణా అవకాశం కల్పించాలని వారు కోరారు.

అసోసియేషన్ డిమాండ్లు ఇవీ..

- స్థానికుల టిప్పర్ల ద్వారానే పరిశ్రమలకు బూడిద తరలించే అవకాశం కల్పించాలి.
- ఇటుక బట్టీల యాజమానులు తమ సొంత టిప్పర్లతో కాకుండా అసోసియేషన్ ఆధ్వర్యంలోని టిప్పర్ల ద్వారా బూడిద రవాణా చేసే బాధ్యతలు అప్పగించాలి.
- నేషనల్ హైవే అథారిటీ పనులకు కూడా స్థానిక టిప్పర్ల ద్వారా బూడిద తరలించేందుకు అవకాశం కల్పించాలి.
- మెరుగైన రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ కోసం యాజమాన్యమే ఖర్చులు చెల్లించాలి.
- సింగరేణి, ఎన్‌హెచ్ పేరిట తరలిస్తున్న బూడిదను పక్కదారి పట్టకుండా నిఘా పెంచాలి.
- ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాలకు బూడిద రవాణా చేసే బాధ్యతలు అప్పగించాలి.
- వారి ద్వారానే బూడిద పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలి.
- తద్వారా వచ్చే ఆదాయం నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి వెచ్చించుకునే అవకాశం కల్పించాలి.

జాతరకు పైసల్లేవు



మరికొద్ది రోజుల్లో సమ్మక్క, సారలమ్మ జాతర ఉంది. ఇంట్ల పూజలు చేయాల్సి ఉంది. ఆ తర్వాత వన దేవతలను దర్శించుకోవాలి. వీటన్నింటికీ ఇప్పుడు మా దగ్గర పైసల్లేవు. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి సమస్య పరిష్కరించాలి. – శివరాత్రి గంగాధర్, ఉపాధ్యక్షుడు, టిప్పర్ అసోసియేషన్

వాయిదాలు చెల్లించలేక..



టిప్పర్‌కు రోజూ కిరాయి దొరికితేనే ఫైనాన్స్ వాయిదాలు చెల్లించాల్సి ఉంది. రోజూ వచ్చే ఆదాయంతోనే పూటగడిచేది. వారంరోజులుగా సమ్మె చేస్తున్నాం. పైసా రావట్లేదు. ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయి. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించాలి.
– కస్తూరి సుమన్, ప్రధాన కార్యదర్శి

అసోసియేషన్‌కు అప్పగించాలి



సింగరేణి భూగర్భ గనులు, నేషనల్ హైవే రహదారులకు బూడిద రవాణా చేసే బాధ్యతలను స్థానిక అసోసియేషన్ టిప్పర్లకు అప్పగించాలి. యాష్ పాండ్ నుంచి బూడిద తరలించే హక్కులను ప్రభావిత గ్రామాలకు కల్పించాలి.
– సంపంగి వెంకటేశ్, సలహాదారు

ఊరుకునేదిలేదు



ఎన్టీపీసీ యాజమాన్యం తీరుతో స్థానికులకు ఉపాధి కరువైంది. రూ.కోట్ల సీఎస్ఆర్ నిధులను పొరుగు జిల్లాలకు తరలిస్తే ఊరుకునేదిలేదు. స్థానిక టిప్పర్లకు లోడింగ్, రవాణా అధికారం కల్పించాలి. స్థానికేతరులు ఇక్కడినుంచి వెళ్లిపోవాలి.
– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

క్లుప్తంగా

జాతీయ సెమినార్‌కు ఉపాధ్యాయుడికి ఆహ్వానం


గంగాధర్

జగిత్యాల: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఢిల్లీవారు ఏటా జనవరి 29 నుంచి 31 వరకు జాతీయస్థాయిలో స్కూల్ లీడర్‌షిప్ సెమినార్ నిర్వహిస్తుంటారు. ఈసారి సెమినార్‌కు కోరుట్లలో ఎంపీపీఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అడ్లగట్ల గంగాధర్‌కు ఆహ్వానం అందింది. సంబంధిత ఉత్తర్వుల కాపీని డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఆయనకు అందజేశారు. గంగాధర్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పించేందుకు కృషి చేస్తున్నారు. సెక్టోరల్ అధికారులు కొక్కుల రాజేశ్, ఏడీ శివకృష్ణ, పీఆర్టీయూ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఆయనను బుధవారం అభినందించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ


పగులగొట్టిన బీరువా

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దేశాయిపేట గ్రామంలో తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిరంగి దేవలక్ష్మి బుధవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, బీరువాను పగులగొట్టి, 4 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే, జక్కుల బాలయ్య కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి, బయటకు వెళ్లగా దొంగలు పడి, రూ.4 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

విద్యుత్ మోటార్లు..

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లలో 5 మంగళవారం రాత్రి చోరీకి గురయ్యారని రైతులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం 9, మర్రివానిపల్లిలో 5 మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వరి నాట్లు వేసే సమయానికి ఇలా జరగడంతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు. పోలీసులు రాత్రివేళ గస్తీ తిరగకపోవడం వల్లే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దుండగులను పట్టుకొని, కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆవులను తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం: ఆవులను తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్ బుధవారం తెల్లవారుజామున గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ.ఇమ్రాన్ రాజీవ్‌నగర్‌లోని కబేలా వద్ద నుంచి ఆవులు, దూడలను తరలిస్తూ కనిపించాడు. అతన్ని ఆపి, విచారించగా పశువుల మాంసం విక్రయించడం తన కుల వృత్తి అని తెలిపాడు. దీంతో ఇమ్రాన్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చిన్నారుల్లో చిరునవ్వులు

- ప్రతిష్టాత్మకంగా ఆపరేషన్ స్మైల్ -10
- తప్పిపోయిన, మానవ అక్రమ రవాణాపై దృష్టి
- బాలకార్మికుల గుర్తింపు.. హాస్టళ్లలో ప్రవేశం
- డ్రాపౌట్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ


సమావేశమైన పోలీసు అధికారులు

గోదావరిఖని: బాల్యం అమూల్యమైంది. దానిని అనుభవించడం ప్రతీ పౌరుడి హక్కు. చిరుప్రాయంలోనే బందీలుగా కాకుండా స్వేచ్ఛగా, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తోంది. ప్రధానంగా చిన్నారుల మోములో చిరునవ్వులు చిందించడం, తప్పిపోయిన వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం, డ్రాపౌట్ పిల్లలను బడిలో చేర్పించడం, మానవ అక్రమ రవాణాలో బందీలకు విముక్తి కల్పించడం.. ఇలా ఆపరేషన్ స్మైల్‌పై పోలీస్‌శాఖ దృష్టి సారించింది.

రామగుండం కమిషనరేట్ పరిధిలో..

రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏసీపీ వెంకటేశ్వర్లు ఈ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్నారు. 25 అధికారులు, సిబ్బంది కలిసి ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నారు. ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూన్‌లో ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఈకార్యక్రమం చేపడుతోంది. పదో దఫా పోలీసు, మహిళా శిశు సంక్షేమ, కార్మికశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు, ఇటుకబట్టీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తోంది. బాల కార్మికులను గుర్తించడంతోపాటు చట్టానికి విరుద్ధంగా పనిచేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా గత 8ఏళ్లలో 2,134మంది బాలకార్మికులు, బడీడు పిల్లలను గుర్తించారు.

ఆపరేషన్ స్మైల్ లక్ష్యం ఇలా..

- తప్పిపోయిన పిల్లలను 'దర్పణ్' అప్లికేషన్ ద్వారా గుర్తించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పర్చడం
- మళ్లీ తల్లిదండ్రుల వద్దకు చేర్చి వారి శోకం తీర్చడం
- భిక్షాటన చేస్తున్న, బాలకార్మికులను గుర్తించడం
- ప్రత్యేక సమాచారం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112 ఏర్పాటు
- ప్రతీపోలీస్ సబ్ డివిజన్ స్థాయిలో ఎస్సైతోపాటు నలుగురు సిబ్బంది నియామకం
- నెలపాటు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ట్రాఫిక్ జంక్షన్లు తనిఖీ చేయడం
- డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులకు నచ్చజెప్పి మళ్లీ పాఠశాలల్లో చేర్పించడం
- మానవ అక్రమ రవాణాలో బందీలైన చిన్నారులను గుర్తించి వెలుగులు నింపడం.

అధికారులు గుర్తించిన బాల, బాలికల వివరాలు

ఏడాది	బాలురు	బాలికలు	మొత్తం
2017	556	156	712
2018	338	81	419
2019	293	119	412
2020	152	37	189
2021	188	25	213
2022	82	14	96
2023	82	11	93

పర్యవేక్షిస్తున్నాం

ఆపరేషన్ స్మైల్‌పై రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వారీగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఈ ప్రక్రియను కచ్చితం అమలు చేస్తుండడంతో బాలకార్మికులు, బడీడీలు పిల్లల సంఖ్య భారీగా తగ్గింది. పలు ప్రాంతాలను ఎంచుకుని ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తున్నాం. లైసెన్స్ లేకుండా బాలల ఆశ్రమాలు నడిపిస్తే ఊరుకోబోం.

– వెంకటేశ్వర్లు, 'స్మైల్'ఇన్‌చార్జి, ఏసీపీ

తెలంగాణ ఉద్యమంలో గాలన్నది కీలక పాత్ర

సైదాపూర్(హుస్నాబాద్): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం పరామర్శించారు. ఆయన మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గాలన్న తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కేటీఆర్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. గాలన్న కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. హుసుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు జేఈఈ మెయిన్స్ ప్రశాంతం


పరీక్షా కేంద్రంలో క్యూలైన్‌లో విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్‌లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు డిజిటల్ సెంటర్‌ను ఎంపిక చేశామని, ఈ నెల 27 నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సిటీ కో–ఆర్డినేటర్ లలిత కుమార్ తెలిపారు. కరోనా నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల మధ్య భౌతిక దూరం ఉండేలా చర్యలు తీసుకున్నారు. కేవలం మధ్యాహ్నం షిఫ్టులో 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 422 మంది విద్యార్థులకు గానూ 382 మంది హాజరయ్యారు. విజయ్‌కుమార్, తిరుపతి రెడ్డి అబ్జర్వర్లుగా వ్యవహరించారు. మొదటిరోజు ప్రశాంతంగా ముగిసిందని, ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ గిరిజన రైతు మృతి

- సోదరుడితో భూ వివాదం కారణంగా ఆత్మహత్యాయత్నం
- న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ఆందోళన


నాజం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సోదరుడే తన భూమిని కాజేయడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన రైతు క్రిమిసంహారక మందు తాగగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారం పరిధి పోచమ్మతండా చెందిన బానోతు నాజం(42) బతుకుదెరువు కోసం ఆరేళ్లపాటు గల్ఫ్ వెళ్లాడు. అక్కడినుంచి పంపించిన డబ్బులతో ఆయన సోదరుడు గణేశ్ రెండెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం స్వగ్రామం వచ్చిన నాజం ఆ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని గణేశ్‌ని అడిగాడు. దీనికి అతను నిరాకరించడంతో 8 నెలల క్రితం కుల పెద్దలను ఆశ్రయించాడు. ఈ విషయంలో వారు కూడా న్యాయం చేయలేదు. భూమి ఆయన పేరిట లేకపోవడంతో రైతుబంధు డబ్బులు కూడా రావడం లేదు. తనకు ఇక భూమి దక్కదని మనస్తాపానికి గురై, గత గురువారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు దవాఖానా ఎదుట ఆందోళనకు దిగారు. భూ వివాదం వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య జ్యోతి వేడుకుంది. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించవద్దని కోరింది. నాజంకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పెద్ద మనుషులు జోక్యం చేసుకొని, పరిహారంపై చర్చలు జరుపుతున్నారు.

రవాణాశాఖ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి ఎన్నిక


కల్యాణిశ్రీని అభినందిస్తున్న అధికారులు

కోరుట్ల: తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ బాసర జోన్–2 అధ్యక్షురాలిగా జగిత్యాల రవాణా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న కె.కల్యాణిశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం డ్రైవింగ్ ట్రాక్‌లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. జనరల్ సెక్రటరీగా బాపన్న, కోశాధికారిగా ప్రేమ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రదీప్ తెలిపారు. జగిత్యాల రవాణా శాఖ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. డీటీవో వంశీధర్, ఎంవీఐ రంజిత్ తదితరులున్నారు.

నువ్వు విత్తన శుద్ధి


విత్తనశుద్ధి చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రుద్రంగి(వేములవాడ): పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం(ఆర్ఏడబ్ల్యూఈపీ)లో భాగంగా బుధవారం మానాలలో నువ్వు విత్తన శుద్ధి చేసి, విత్తారు. నువ్వులలో తొలిదశలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి విత్తనశుద్ధి ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేముల అఖిల, మెరుగు సింధూజ, గాలి అమూల్య, చిలుకుల సుష్మప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి విజయ్, రైతులు పాలనర్సు, గంగు, గణేష్, బానోత్ రాజు, కుర్తిలాల్, అజ్మీర రవీందర్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇల్లందకుంట(హుజూరాబాద్): లక్ష్మాజిపల్లికి చెందిన నల్ల మల్లారెడ్డి(37) ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లారెడ్డికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కానీ, పెళ్లయిన మూడోరోజే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తండ్రి మృతిచెందాడు. దీనికితోడు కొన్ని రోజులుగా మల్లారెడ్డి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుని తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నారు.

వాహనాలకు 30న వేలం


సీపీ రెమారాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు పట్టుకున్న వాహనాలకు ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఠాణాల పరిధిలో 81 వాహనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం నిర్వహిస్తామని, రావాలనుకునేవారు ఆధార్ కార్డు, ఇతర ఏదైనా కేంద్ర, రాష్ట్ర గుర్తింపు కార్డుతో రావాలని సూచించారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరికి ఏడాది జైలు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని చామనపల్లికి చెందిన తాళ్ల దేవరాజును చంపుతామని బెదిరించిన కేసులో తాళ్ల శంకరయ్య, అనిల్‌లకు నందిమేడారం జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి రాణి ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. 2 జూలై 2014న దేవరాజు ఇంట్లోకి చామనపల్లికే చెందిన శంకరయ్య, అనిల్, కనకమ్మ అక్రమంగా ప్రవేశించి, పిండి గిర్ని ధ్వంసం చేశారు. అంతేకాకుండా అతన్ని చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై హరీశ్ వారిపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురిలో కనకమ్మ చనిపోయింది. ప్రస్తుత ఎస్సై సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ సంతోష్ బుధవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి, శంకరయ్య, అనిల్‌లకు శిక్ష విధించారు.

చీటింగ్ కేసులో ఒకరికి రెండేళ్లు..

సిరిసిల్ల క్రైం: భూమి అమ్ముతానని మోసం చేసిన ఒకరికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎల్లగొండ రాజేందర్, సామల పోశెట్టి భూ క్రయవిక్రయాలు చేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రాంతంలో భూమి ఉందని, విక్రయిస్తామని సిరిసిల్లకు చెందిన తడుక సత్యనారాయణ వద్ద 2010లో రూ.4 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగతా సొమ్ము చెల్లించి, భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటానని ఆయన చెప్పినా వారు స్పందించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి, రాజేందర్‌కు జైలుశిక్ష, జరిమానా విధించారు.

విద్యారణ్యపురిలో అగ్ని ప్రమాదం

కరీంనగర్ క్రైం: నగరంలోని విద్యారణ్యపురిలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారుల వివరాల ప్రకారం.. విద్యారణ్యపురిలోని వెంకటేశ్ ఇంట్లో బుధవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ లీకైంది. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి, మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశామని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

గుడిసెవాసులపై కేసులు ఎత్తివేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న లక్ష్మి

కరీంనగర్: గుడిసెవాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగిత్యాలలో 5 నెలలుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, అది గతంలో ఎవరికీ కేటాయించింది కాదన్నారు. అరెస్టు చేసిన 9 మందిని తక్షణమే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను ఐక్యం చేసి, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి మాట్లాడుతూ.. అక్రమ కేసులను ఎత్తివేసి, పేదలకు 200 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా రాష్ట్ర బృందం జైలు వద్దకు వెళ్లి, అరెస్టయిన వారిని పరామర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ఆశాలత, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెలిగొండ పద్మ తదితరులున్నారు.

చిరుత కాదు.. హైనా!


మేడిపల్లి శివారు భూమిలో పాదముద్రలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి శివారులో చిరుత సంచారంపై అటవీ శాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. మెట్‌పల్లి–అమ్మక్కపేట మధ్య రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్ అయిందన్నారు. కానీ, అది చిరుత కాదని తేల్చిచెప్పారు. బుధవారం మేడిపల్లికి చెందిన పీసు భూమయ్య అనే రైతు వ్యవసాయ భూమిలో పాదముద్రలను గుర్తించిన అధికారులు అవి హైనా పాదముద్రల మాదిరిగా ఉన్నాయని పేర్కొన్నారు. సమీప ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన పత్తి


మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది


దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్ఐ తిరుపతి

వేములవాడ అర్బన్: వేలాడుతున్న విద్యుత్ తీగలు పత్తి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌కు తగిలి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రెడ్డి కాలనీలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న సుమారు 5 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు రైతు ఇన్నారెడ్డి తెలిపారు.

వెంకటేశ్వరపల్లిలోని ఇంట్లో సామగ్రి..

జమ్మికుంట(హుజూరాబాద్): షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన రామడుగు సంపత్‌రావు బుధవారం తన పొలం వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు లేచాయి. లోపల వస్తువులన్నీ కాలిపోయాయి. రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ తిరుపతి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సర్పంచ్ కుమార్, గ్రామస్తులు కోరారు.

గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్టు


చాక్లెట్లు, అన్సారీని చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బండారికుంట ప్రాంతంలో యువకులకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న అర్సలన్ అన్సారీని అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. పట్టణంలోని అమర్‌నగర్‌లో గల ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్న వ్యక్తి గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నాడంటూ అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బుధవారం ఆకస్మికంగా దాడి చేశామన్నారు. అన్సారీని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 51 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయికి బానిసైన అతను తక్కువ సమయంలో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పెద్దపల్లికి పలు జిల్లాల నుంచి వచ్చే యువతకు వాటిని విక్రయించవచ్చన్న ఆలోచనతో కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. తదుపరి విచారణ కోసం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు వివరాలు అందించినట్లు తెలిపారు. పెద్దపల్లికి రైలు మార్గం ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా సులువుగా చేస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తూ ఇదివరకు పలువురు పట్టుబడ్డారు. యువతను మత్తుకు బానిసలుగా చేసేందుకు తక్కువ ధరకే కొంచెం గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పాకెట్ల రూపంలో అంటగడుతున్నట్లు తెలుస్తోంది. అయితే, విక్రయిస్తున్న వారంతా గంజాయి సేవించే వారేనని పోలీసులు చెబుతుండటం గమనార్హం.

'శ్రీ చైతన్య'లో అలరించిన ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మసీ పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా మెళకువలు నేర్చుకొని, గమ్యాన్ని చేరుకోవాలన్నారు. టెక్నాలజీ ద్వారా డ్రగ్స్, ఫార్మసీ రంగానికి సంబంధించిన నైపుణ్యం పెంపొందించుకొని, సమాజానికి అవసరమైన మందులు తయారీలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంనరసింహారెడ్డి, అధ్యాపకులు రాంప్రసాద్, ధనుంజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీడీ స్టోర్ పేరిట మోసం

- ప్రచారం పేరిట సైబర్ నేరగాళ్ల వల
- లబోదిబోమంటున్న బాధితులు

సిరిసిల్లక్రైం: తమ సరుకుల వివరాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ప్రతీ నెల సొమ్ము ఇస్తామని చెప్పిన ఏబీడీ స్టోర్ నిర్వాహకులు ముందుగా చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వడం లేదని జిల్లా కేంద్రంలో బాధితులు లబోదిబోమంటున్నారు. ముందుగా ఏబీడీలో ప్రచారం చేయడానికి కనీసంగా రూ.600 చెల్లించాలని, తర్వాత ఒక సరుకు గురించి మూడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే నెలకు వేలల్లో జీతం ఇస్తామని ఆన్‌లైన్‌లో కొందరు వలవేశారు. ఇంటిలో ఉంటూ పనిచేయడం సులభమని నమ్మిన పలువురు మహిళలు వారికి తెలిసిన వారిని ఈ ప్రచారంలో భాగస్వాములను చేశారు. గత ఆరు నెలలుగా వేలాది మంది రూ.600 చెల్లించి ఏబీడీ స్టోర్ పేరిట ఉన్న ప్రకటనలను ప్రచారం చేసినట్లు ఓ బాధితుడు తెలిపారు. ముందు 3 నెలలు ఫోన్‌లో పలువురు వ్యక్తులు రోజూ మాట్లాడారని, తర్వాత మాట్లాడడం బంద్‌చేశారని తెలిపారు. ఇప్పుడు కనీసం ఫోన్‌చేస్తే సమాధానం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఇంట్లో ఉండి పనిచేయడం పేరిట లక్షల రూపాయలను గొలుసు వ్యాపార విధానంలో సైబర్ నేరగాళ్లు లాగేసినట్లు తెలిసింది. దీనిపై కొందరు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎల్లారెడ్డిపేటలో గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన దేవయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పుల్లక్ దేవయ్య(65) బుధవారం ఈత చెట్టు పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దేవయ్య ఎడమ చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక గౌడసంఘం ప్రతినిధులు స్పందించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవయ్యకు ఎక్సైజ్ అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, నాగుల ప్రదీప్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.